క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గండీడ్: మండలపరిధిలోని వెన్నాచేడ్‌లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగలక్ష్మి పరిశీలించారు. శుక్రవారం గ్రామంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు చేరుకొని వసతులు పరిశీలించారు. నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కరెంటు ఇతర వసతులపై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఓట్లు తొలగించారని ఆందోళన

జడ్చర్ల: పట్టణంలో పలువురి ఓట్లు గల్లంతు కావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో ఓట్లు వేశామని అయితే తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో జాబితా నుంచి తమ ఓట్లను తొలగించారని వారు తెలిపారు. స్థానిక గౌరీశంకర్ కాలనీలో మరణించిన తమ తల్లి ఓటును ఉంచి బతికి ఉన్న తన ఓటును తొలగించారని మంచని పాండయ్య అనే ఓటరు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చాలామంది ఓట్లు గల్లంతు చేశారని 3వ వార్డు కౌన్సిలర్ సతీష్ స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. కాగా విచారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ వివరించారు.

హజ్ యాత్రికులకు ఘనసన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని జామీయ మజీద్‌లో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది హజ్‌యాత్రకు వెళ్తున్న పలువురు యాత్రికులను ఘనంగా సన్మానించారు. ప్రతినిధులు మాట్లాడుతూ తమ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏటా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మతపెద్ద మౌలానా సమీర్ అహ్మద్, మజీద్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్ సనా, ఉపాధ్యక్షుడు అమీనుద్దీన్ పాల్గొన్నారు.

జనజాతరకు తరలిరండి

గండీడ్: తాండూరులో శనివారం ఉదయం జరిగే జనజాతర సభకు భారీగా తరలి రావాలని గండీడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సభ జరుగుతుందన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ రానున్నట్లు వివరించారు.

ప్రమాద బీమా పత్రాల అందజేత

రాజాపూర్: మండల కేంద్రంలో శనివారం భారతీ సిమెంట్‌సంస్థ ఆధ్వర్యంలో 50 మంది మేస్త్రీలకు సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ రూ. లక్ష విలువ కలిగిన ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీ సిమెంట్ అల్ట్రా ఫాస్ట్‌తో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఇంజనీర్ నితిన్ డీలర్ నారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పార్లమెంట్ ఎన్నికల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల నుంచి సిబ్బందిని వీలైనంత త్వరగా పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని కోరుతూ డీటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం, మొక్కజొన్న బస్తాలు దగ్ధం

జడ్చర్ల: స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో గురువారం రాత్రి మొక్కజొన్న లోడ్‌తో నిలిపిన డీసీఎం ప్రమాదవశాత్తు దగ్ధం అయ్యింది. అగ్ని ప్రమాదంలో డీసీఎంతో పాటు 160 బస్తాల మొక్కజొన్న కూడా దగ్ధం అయ్యింది. దీంతో దాదాపు రూ. 7లక్షల ఆస్తినష్టం సంభవించిందని డీసీఎం యజమాని మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

సాయి సంగీత ప్రతిభ అభినందనీయం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవలే దుబాయిలో జరిగిన జూనియర్ ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారిణి సాయిసంగీత బంగారు పతకం సాధించడం అభినందనీయమని పలువురు క్రీడాసంఘాల ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, పలు క్రీడాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయిసంగీతను ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ రామ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి ఆర్.బాల్‌రాజు, జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండి.జియావుద్దీన్, దామోదర్ రెడ్డి, నర్సింలు, సునీల్, శ్రీనివాసులు, ఖలీల్, పర్వేజ్, అనిల్, శ్రీనివాసులు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



నవాబుపేటలో పూజలు చేస్తున్న సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు



బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వంశీచంద్‌రెడ్డి తదితరులు



వెన్నాచేడ్‌లో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: బసవేశ్వరుడు సమసమాజ స్థాపనకు కృషిచేసిన మహనీయుడని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని గుండప్పకాంపౌండ్‌లో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, లింగాయత్ సభ్యులు ముంద్రతి శివకువర్, జీవన్, అమర్‌నాథ్, రవిశంకర్, రజిని, గణేస్, అశోక్, సురేష్, పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలో శుక్రవారం మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కేఎస్.రవికుమార్, ఉమేష్, కార్తీక్, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ సైతం విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. బసవేశ్వరుడు విశ్వగురువు అని, ఆయన బోధనలు నేటి తరం యువతకు ఆదర్శ ప్రాయమని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ముఖ్య వక్తగా హాజరైన పీయూ మాజీ ఈసీ మెంబర్ చంద్రయ్య సమాజంలో ప్రజల మధ్య బేధాల్ని తగ్గించేందుకు బసవేశ్వరుడు మొదటి సారిగా కులాంతర వివాహం చేశారని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ ప్రవీణ, కంట్రోలర్ రాజ్‌కుమార్, సీనియర్ ప్రొఫెసర్ సోమలింగంతదితరులు పాల్గొన్నారు.

గండీడ్ పరిధిలో వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వేడుక నిర్వహించారు. పూజారి సదాశివ, బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, అనంతలక్ష్మారెడ్డి, సత్యసాయి సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. నవాబుపేటలో శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో బసవేశ్వరుడి చిత్రపటానికి పూజలు చేశారు. పెద్ద శివాలయం పూజారి రామేశ్వరయ్య, నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, చిన్నస్వామి, వెంకటేష్, అనంతయ్య తదితరులు ఉన్నారు.

పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న స్కాలర్స్



పట్టాలు అందిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, కేయూ ప్రొఫెసర్ శ్రీనివాస్‌ముంజం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరు స్కాలర్స్ ఒకే రోజు పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు. పీయూ అధ్యాపకుడు కిశోర్ పర్యవేక్షణలో ఎం.శ్రీనివాసరావు 'అల్లివియేషన్ ఆఫ్ డ్రాట్ స్ట్రెస్ ఆన్ క్యాప్సికం అన్నుమ్ అండ్ సైమోపసిస్ టెట్రగోనోలోబ బై యూజిగ్ ప్లాంట్ గ్రోత్ ప్రమోటింగ్ బ్యాక్టీరియా' అంశంపై పరిశోధన చేసి తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఆయనతో పాటు చేతన కూడా పరిశోధనపత్రాన్ని సమర్పించి పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు. మైక్రోబయోలజీ అధ్యాపకుడు మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో 'మైక్రోబియల్ ప్రొడక్షన్ ఆఫ్ పెక్టినసెస్ ఫ్రో అస్పర్గిల్లస్ నైజెర్ ఆఫ్ ఫ్రూట్ జ్యూస్ క్లారిఫికేషన్, రై పీనింగ్ అండ్ పీల్ డిగ్రేడేసన్' అంశంపై పరిశోధన అనంతరం పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈమేరకు ఇద్దరు స్కాలర్స్‌కు వైవా నిర్వహించేందుకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ముంజం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న ఇద్దరు స్కాలర్స్‌ను పీయూ వైస్‌ఛాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు. రీసెర్చ్‌పై అధ్యాపకులు, స్కాలర్స్ దృష్టిసారించి మరిన్ని పరిశోధనలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ శాంతిప్రియ, కంట్రోలర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సరైన వసతులు అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిర

పాలమూరు: రాష్ట్ర సదనంతో పాటు శిశుగృహాలలో చిన్నారులకు సరైన వసతులు కల్పించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డి.ఇందిర అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న రాష్ట్ర సదనం(స్టేట్ హోం), శిశుగృహాలను శుక్రవారం సందర్శించారు. అమ్మాయిలకు, చిన్నారులకు అందుతున్న వసతులు, భోజనం, నీటి సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పోక్సో యాక్ట్, లీగల్ సర్వీసెస్ యాక్ట్, బాల్యవివాహాలు, బాలల విద్య, బాలల హక్కులపై న్యాయమూర్తి వివరించారు. మీ సమస్యలకు న్యాయ పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పని చేస్తుందని తెలిపారు.

అక్షయ తృతీయ పూజలు

దేవరకద్ర: పట్టణంలోని రాయిచూర్ రోడ్డులో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతం, పంచ వర్ణాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేషమైన అర్చనలు నిర్వహించారు. అలాగే అనుబంధ ఆలయం శ్రీలక్ష్మీ వరాహ స్వామివారికి విశేషమైన అభిషేకం, పూల అలంకరణ, నూతన వస్త్రాలంకరణ, ప్రత్యేక అర్చనలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక అభిషేకం

నవాబుపేట: మండల కేంద్రంలోని సాయిదేవాలయంలో 6వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. సాయినాథుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అదేవిధంగా సాయివ్రతం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ రవీందర్, దాత అనంతకృష్ణ, సరస్వతీ, హేమలత, రాజు పాల్గొన్నారు.

ఓటును అమ్ముకోవద్దు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డబ్బుకు మద్యానికి ఓటు అమ్ముకోవద్దని.. జైహో సంఘం నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు లకేష్మేశ్వర్ దున్న మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, జస్ట్ ఓటు తెలంగాణ అధ్యక్షుడు ముంతాజ్ ఇమ్మామ్, శాంత, సింధు, సారా పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ కాల్వలో ఉపాధి పనులు

దేవరకద్ర: మీనుగోనిపల్లి వంతెన నుంచి రెండు కిలో మీటర్ల మేర కోయిల్‌సాగర్ కాల్వలో పీల్డు తీసే పనులు చేపట్టారు. ఉపాధి హామి పథకంలో భాగంగా గత రెండు రోజుల నుంచి పనులు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం దాదాపు 150 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారు. కాల్వలో మట్టిని, తుంగ, చెత్త తొలగిస్తున్నారు. వానాకాలం సీజన్ వరకు కాల్వలను సిద్ధం చేయడానికి పనులు సాగిస్తున్నట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు.

నీటి సమస్య తీర్చండి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో వారం రోజులుగా నీటి సరఫరా జరగటం లేదని పేర్కొన్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వివరించారు. సరఫరా తిరిగి ప్రారంభించే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

రోహిత్ వేముల మృతికి కారకులెవరో తెలుసు



రోహిత్ వేముల ఫొటోలను విడుదల చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన దళిత రీసర్చ్ స్కాలర్ రోహిత్ వేముల 2016 జనవరి 17న వ్యవస్థీకృత హత్యకు గురైన విషయం అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనాన్ని రేకెత్తించిందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవచారి తెలిపారు. శుక్రవారం కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో అంబేద్కర్ భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్‌కు, ఆధిపత్య మనువాద భావజాలానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ఏబీవీపీ విద్యార్థి సంఘానికి మధ్య తలెత్తిన ఘర్షణలో యూనివర్సిటీ వీసీ అప్పారావు బీజేపీ అధికార అనుబంధ సంఘం ఏబీవీపీ వైపు నిలబడి దళిత విద్యార్థులను చదువు నుంచి బహిష్కరించడం జరిగిందని గుర్తుచేశారు. అత్యున్నత విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులు తమతో సమానంగా చదువుకోవడాన్ని జీర్ణించుకోలేని అగ్రకుల విద్యార్థులు, అగ్రకుల ప్రొఫెసర్లు దళిత విద్యార్థులను అడుగడుగునా కుల వివక్ష ప్రదర్శించి అవమానించారని తెలిపారు. రోహిత్ వేముల బలవన్మరణానికి కారకులైన వారిని నేరం నుంచి తప్పించి రక్షించడానికి దళితుడు కాదని, నకిలీ సర్టిఫికెట్ తెచ్చుకున్నాడని, చదవలేక వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయన మరణానికి నిందితులు కారకులు కాదని చెప్పడానికే ప్రయత్నం చేస్తూ నివేదికను తయారు చేశారని ఆరోపించారు. సమావేశంలో చక్రవర్తి, ఖలీల్, నాగభూషణం, ఎర్ర మోహనకృష్ణ, శ్రీనివాస్, కృష్ణయ్య, విజయ్ పాల్గొన్నారు.

పక్క గ్రామం నుంచి కల్లు తెస్తున్నాడని దాడి.. వ్యక్తి మృతి

గండీడ్: పక్క గ్రామం నుంచి కల్లు తెస్తున్నాడనే నెపంతో ఓ వ్యక్తిపై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గండీడ్‌కు చెందిన అష్రాఫ్(28)కు కల్లు తాగే అలవాటు ఉంది. స్థానికంగా కల్లు బాగోలేకపోవడంతో పక్క గ్రామమైన రెడ్డిపల్లికి వెళ్లి కల్లు తాగి వచ్చేవాడు. రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం వెళ్లి తండ్రి మౌలానాతో కలిసి కల్లు తెస్తుండగా గండీడ్‌కు చెందిన జోగు కృష్ణ అడ్డుకొని పక్క గ్రామానికి ఎందుకు వెళ్లారని తండ్రి, కొడుకును నిలదీస్తూ దాడి చేశాడు. తండ్రి మౌలానా తప్పించుకొని పారిపోగా.. అష్రాఫ్‌ను చితకబాదడంతో దెబ్బలకు తాళలేక అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో తన కొడుకు మరణానికి జోగు కృష్ణ కారణమని, గతంలోనూ ఇలాగే దాడి చేశాడని పేర్కొంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. అష్రాఫ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ గాంధీనాయక్ పరిశీలించారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు



జడ్చర్లలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జడ్చర్లలోని 25, 26, 27 వార్డులలోని ఇందిరానగర్, వెంకటేశ్వరకాలనీ, లక్ష్మి కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు. అదేవిధంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. ఈ ఎన్నికలలో బీఆర్‌ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, నాయకులు రంజిత్ బాబు, నర్సింహులు, లత, పరమటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. జెడ్పీటీసీ శశిరేఖా, ఎంపీపీ, సుదర్శన్, బాలు, పాండు, సుకుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించారు

దేవరకద్ర: ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఆరు నెలలు గడుస్తున్న నేరవేర్చడం లేదని టీఎస్‌టీటీసీఎఫ్‌ఎల్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం రాత్రి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు తాగునీరు, సాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ ప్రగతి

దేవరకద్ర: బీజేపీతోనే దేశం అన్ని రంగాలలో ప్రగతి సాధిస్తుందని దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదలకు ఉచిత బియ్యం అందిస్తున్నది బీజేపీ ప్రభుత్వమని అన్నారు. ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీజేపీ నాయకులు అశోక్‌సాగర్, శంకర్, అయ్యన్న, రాఘవేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయం ఖాయం



నవాబుపేట: పాలమూర్‌లో రెండోసారి బీఆర్‌ఎస్ గెలుపు పక్కా అని తేలిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో మండలంలోని బీఎస్పీ అధ్యక్షుడు శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రతాప్, రాంప్రసాద్, సంతోష్‌రెడ్డి, నవనీత్, రవి, లక్ష్మయ్య, శ్రీనివాస్, పురుషోత్తం, తిర్పతయ్య ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

జడ్చర్ల: ఓ భర్త అదనపు కట్నం కోసం తన భార్య న్యూడ్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న ఘటనలో అతడిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు..స్థానిక నిమ్మబాయిగడ్డలో నివాసం ఉంటున్న వివాహిత(22) స్నానపు గదిలో ఉండగా ఆమె తన భర్త అర్జున్‌సింగ్ చాటుమాటుగా ఫొటోలు తీశాడు. అదనపు కట్నం రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భార్య బంధువులకు వాట్సాప్‌లో వాటిని షేర్ చేసి ఆమెను తీవ్రమానసిక క్షోభకు గురిచేశాడు. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం

చిన్నచింతకుంట: ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అని అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పిస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, బీడీ ఫ్యాక్టరీల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మాజీ ఉప సర్పంచ్ కమ్మరి బాలస్వామి శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిన్నకుర్మన్న, కోస్గి రాములు, గోప్లాపూర్ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

బాలానగర్: మండల పరిధిలోని పలువురు బేడ బుడిగ జంగం నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జుమా అనంతరం శుక్రవారం వివిధ మజీదుల బయట కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ కోఆర్డినేటర్ మక్సూద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: మండల పరిధిలోని పలువురు నాయకులు, మాజీ సర్పంచులు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల విభాగం అధ్యక్షురాలు సునీత తదితరులు మన్సూర్‌పల్లి, మన్సూర్‌పల్లి తండాల్లో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవండి



పార్టీల చేరిన వారితో ఎమ్మెల్యే తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా 10వ వార్డు క్రిస్టియన్‌పల్లి, డబుల్‌కాలనీవాసులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రరూ. వేల కోట్ల అభివృద్ధి పనుల కోసం పాలమూరు ఎదురుచూస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ రాణిరాజు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, పాండు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే యెన్నం శుక్రవారం స్థానిక శివశక్తినగర్‌లో 11, 22, 23, 25 వార్డు ప్రజలతో ఏర్పాటు చేసిన కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు.

హన్వాడ: మన ఒక్క ఓటు రేవంత్‌రెడ్డి గౌరవాన్ని పెంచుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నిలక ప్రచారంలో భాగంగా శుక్రవారం టంకర, బుద్దారం, కొత్తపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా పార్టీలో చేరారు.

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా జడ్చర్లలోని విజయనగర్ కాలనీ, హౌజింగ్ బోర్డు, తదితర కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం మరిచి ప్రజలపై అప్పుల కుప్ప పెట్టిపోయిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శివకుమార్, మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపీపీ నిత్యానందం పాల్గొన్నారు.

రాజాపూర్: భూకబ్జాలకు పాల్పడ్డ దొంగలను ఎంతటి వారైన జైల్లో పెట్టిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రతిపక్షనాయకులను ఘాటుగా హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను కచ్చితంగా అమలు చేస్తానని అన్నారు. నరహరి, విక్రంరెడ్డి, శివకుమార్, శ్రీధర్‌రెడ్డి, తఖీబాబా, కృష్ణయ్య,పాల్గొన్నారు.

కోయిల్‌కొండ రుణం తీర్చుకుంటా

కోయిల్‌కొండ: నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ అందించిన కోయిల్‌కొండ మండలానికి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త కుంభం శివకుమార్‌రెడ్డితో కలిసి కొత్లాబాద్, మల్లాపూర్, సూరారం, ఎల్లారెడ్డిపల్లి, అంకిళ్ల తదితర గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తానన్నారు. నాయకులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, జి.రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, రాజారఘుపతిరెడ్డి, దశరథరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, రవి నాయక్, సందీప్, మహేందర్‌నాయక్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వసతులకు లోటు ఉండరాదు

గండీడ్: మండలపరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మండల ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సెక్టోరియల్ ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లు, బూత్‌లో కరెంటు సౌకర్యం, వచ్చిన సిబ్బందికి భోజన వసతులు ఇతరత్రా అన్ని కల్పించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఎంఈఓ వెంకటయ్య, ఏఈ ముతీమ్, సెక్టోరియల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ ప్రధానిగా ఉండి బీసీలకు చేసిందేమిలేదు



మాట్లాడుతున్న రాచాల యుగేంధర్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ ప్రధాని ఉన్న నరేంద్రమోదీ దేశంలో బీసీల సంక్షేమానికి చేసిందేమిలేదని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారం చేపట్టి పదేళ్ల అవుతున్నా ఇప్పటి వరకు దేశంలో బీసీ గణన చేపట్టలేదన్నారు. యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడూ పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ నేత రాజ్‌నాథ్ సింగ్ మేం అధికారంలోకి వస్తే బీసీ గణన చేపడుతామని ప్రకటించారని గుర్తుచేశారు. హిందువుల్లో 90 శాతం మంది బీసీలే ఉన్నారని, మరీ వారికి ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ గణన చేపడుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వస్తేనే బీసీల హక్కులు నెరవేరుతాయని అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతున్నదని తెలిపారు. బీసీలకు సంబంధించి 18 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ముదిరాజులకు బీసీ–డీ నుంచి బీసీ– ఏ గ్రూపులో మార్చడానికి నిర్ణయించినట్లు తెలిపారు. మన ముఖ్యమంత్రి, మన ఎమ్మెల్యే, మన ఎంపీ అనే నినాదంతో ముందుకుపోయి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందామని కోరారు. సమావేశంలో బండి మల్లేష్, పరమేష్ పాల్గొన్నారు.